ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 25.0
తేమ : 30.0 - 25.0

సాగుకు స్వస్తి


భీమవరం మండలంలో వర్షానికి మునిగిన వరి చేను

- సహకరించని వాతావరణం
- వర్షాలు, వరదలతో 20 వేల ఎకరాల్లో పడని నాట్లు
- మళ్లీ వర్షాలకు ముంపు బారిన 7,500 ఎకరాలు
- మరో తుఫాన్ హెచ్చరిక..
- రైతుల గుండెల్లో రైళ్లు
- ప్రక్షాళనకు నోచుకోని డ్రెయిన్‌లు..

భీమవరం రూరల్, సెప్టెంబరు 3 : సార్వా వరి సాగుకు వర్షపునీరు గండంగా మారింది. సాగు ఆదిలోనే వర్షాలు ముంచెత్తడం, నారుమడులు భారీస్థాయిలో దెబ్బతినడంతో నాట్లు ఆలస్యానికి దారి తీసింది. అప్పుడే 30వేల ఎకరాల నాట్లు దెబ్బతిన్నాయి. దాన్ని నుంచి కోలుకున్న రైతులు మరో సారి నారుమడులు వేశారు. నాట్లు ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో జిల్లాలో ఈ ఏడాది 2లక్షల 11వేల ఎకరాల సార్వా సాగు సాగాల్సింది కాస్తా లక్షా 90వేల ఎకరాలతోనే నాట్లు సరిపెట్టుకోవల్సి వచ్చింది. 20వేల ఎకరాలు రైతులు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మరోసారి వరి సాగు ముంపు గండం ఏర్పడింది. ఇప్పటి వరకు 7,500 ఎకరాల వరి చేలు వర్షపు నీట ముంపు బారిన పడ్డాయి. మిగిలిన సాగులో కూడా కొంత పల్లపు ప్రాంత చేలు ముంపునకు చేరువలో ఉన్నాయి. ఈ తరుణంలో మరో రెండు, మూడు రోజుల్లో తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేయడం రైతులలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే వర్షపునీరు చేలల్లో ఎక్కువ నిలిచి ఉండటంతో దానికి తోడు మరో సారి వర్షాలు కురిస్తే పంట చేలు ముంపు శాతం పెరిగే అవకాశం ఉంటుంది. ఆ లెక్కన సార్వా సాగుకు వర్షాల దెబ్బ కోలుకోలేనిదిగా నిలిచే అవకాశం లేకపోలేదు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

ఒక రోజు, రెండు రోజులు ఒక మాదిరి వర్షాలు పడితేనే చాలా ప్రాంతాలలో వరి చేలు మూడేళ్ళుగా మునిగిపోతున్నాయి. దీంతో సార్వా సాగులో క్రమేపీ సాగు చేసే భూమి తగ్గిపోతున్నది. 2022 సంవత్సరం సార్వా సాగులో లక్ష ఎకరాలు పంట సాగవుతుందని అధికారుల అంచనా వేశారు. 80వేల హెక్టార్లలోనే రైతులు సాగు చేశారు. గత ఏడాది అంతే సాగు చేసినా పంట చేతికి వచ్చే సమయంలో 70శాతం పంట వర్షపునీటికి గురైంది. ఈ ఏడాది 75వేల హెక్టార్లలోనే సార్వా పంట సాగింది. మిగిలిన పంట భూములన్నీ బీడులుగానే ఉండిపోయాయి. భీమవరం మండలంలో తాడేరు, బేతపూడి గ్రామాలలో ఒక్క ఎకరం కూడా సాగుకు నోచుకోలేదు. ఇలా జిల్లాలో మిగిలిన మండలాల్లో సాగు చేయలేని ప్రాంతాలు చాలా ఉన్నాయి.

కాల్వలపై నిర్లక్ష్యం

గడిచిన ఐదేళ్ళల్లో గత వైసీపీ ప్రభుత్వం మురుగు కాలువల అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం చేసింది. అది సార్వా సాగుకు వర్షపు ముంపు తప్పదన్నట్లుగా మారింది. గత ఏడాది పంట మాసుళ్ళ సమయం వరకు అంతంత మాత్రంగానే వర్షాలు ఉన్నాయి. ఆ తరువాత భారీ వర్షాలు పడటం, పంట మొత్తం నీట మునగడం జరిగింది. అప్పట్లో 90వేల హెక్టార్లు వరకు సాగు చేస్తే 55వేల హెక్టార్లు పంట పొలాలు పూర్తిస్థాయిలో నీట మునిగి మాసుళ్ళకు పనిరాకుండా పోయింది. రోజుల తరబడి మురుగునీరు బయటకు వెళ్ళకపోవడం కారణం వలనే చేతికి అందాల్సిన పంట పోయిందని రైతులు ఆందోళన చెందారు. ఆ ముంపు బెడద ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఈ ఏడాది సార్వా సాగుకు నారుమడల దశలోనే రక్షించుకోలేని ముంపు రావడం, కాలువలు అభివృద్ధి చేయకపోవడమే కళ్ళకు కట్టినట్లు కనిపించింది. కూటమి ప్రభుత్వం దీన్ని గుర్తించి అత్యవసరంగా జిల్లాలో రూ.9 కోట్లతో 62 పనులు కాలువల్లోని చెత్త తొలగింపు పనులు చేపట్టింది. దీని వలన రైతులకు వీలు కలిగిన వాతావరణం ఏర్పడింది. ఈ అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 2,620 మి.మీ. వర్షపాతం నమోదుకావడం వరిపొలాలు భారీ ముంపునకు దారి తీయాల్సి ఉంది. అయితే అంత వరకు కాలువల్లోని చెత్త తొలగింపు ముంపు బెడదను కొంత వరకు తగ్గించిందని రైతులు అంటున్నారు.

అభివృద్ధికి ప్రణాళిక

కాలువల అభివృద్ధి ప్రతీ ఏటా జరిగితేనే వరి సాగుకు సాగునీరు ఎద్దడి లేకుండా మురుగునీటితో ముంపునకు గురికాకుండా ఉంటాయి. ఆ ప్రణాళికలో భాగంగానే కూటమి ప్రభుత్వం వచ్చే వేసవిలో కాలువల అభివృద్ధికి రూ.43 కోట్లు ప్రణాళిక సిద్ధం చేసింది. అది అమలు జరిగితేనే వచ్చే ఏడాది నుంచైనా రైతులకు సాగునీటి ఎద్దడి అవస్థలు తగ్గుతాయి. సార్వా పంట ముంపునకు గురవ్వడం ఉండదు. భీమవరం నియోజకవర్గం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఈ మధ్యనే వ్యవసాయంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని వెళ్ళబుచ్చారు. అవసరమైతే భీమవరం నియోజకవర్గం అంతా ఒక పంట క్రాఫ్ హాలిడే ఇచ్చయినా సరే కాలువల అభివృద్ధి చేయడంతో పాటు కాలువల కబ్జాలను కూడా ప్రక్షాళన చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తి చేతిలో పంచాయతీ రికార్డులా ?

పాలకోడేరు, సెప్టెంబరు 3 : గరగపర్రు గ్రామ పంచాయతీలో ఓ ప్రైవేటు వ్యక్తి రికార్డులను సరి చేయడంతో గ్రామస్థులు మంగళవారం పట్టుకున్నారు. అసలు విషయానికి వస్తే గరగపర్రు గ్రామ పంచాయతీలో కొన్ని నెలల క్రితం గరగపర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన రాజేశ్ బదిలీపై వీరవాసరం వెళ్ళిపోయాడు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సెక్రటరీగా పెన్నాడకు చెందిన లక్ష్మీ విధులు నిర్వహించి ఆమె కూడా వెళ్ళిపోయారు. ఈలోగా గ్రామానికి కొత్తగా వచ్చిన గ్రామ కార్యదర్శి లక్ష్మీప్రశాంతి 15 రోజుల క్రితం కార్యదర్శిగా చేరారు. గతంలో పనిచేసి బదిలీపై వెళ్ళిన రాజేశ్ గ్రామ పంచాయతీలోని రికార్డులను సరిచేసేందుకు అప్పనపల్లికి చెందిన కె.సత్యనారాయణను గ్రామ పంచాయతీకి రప్పించి రికార్డులు సరి చేయిస్తున్నారు. దీంతో గ్రామస్థులు తెలుసుకుని అసలు మిమ్మల్ని ఎవరు రప్పించారు, రికార్డు రూమ్‌కు తాళాలు ఎవరూ తీశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రైవేటు వ్యక్తైన సత్యనారాయణను నిలదీశారు. అక్కడితో ఆగకుండా పంచాయతీలో అవకతవకలపై నిగ్గు తేల్చాలంటూ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జనసేనలో విభేదాలు

నరసాపురంలో అధినేత పవన్ పుట్టినరోజు వేడుకల్లో ఎవరికి వారే

నరసాపురం, సెప్టెంబరు 3: నరసాపురం జనసేనలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. సోమవారం అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను వేర్వేరుగా నిర్వహించడంతో పార్టీలోని గ్రూపులు బహిర్గతమయ్యాయి. దీంతో కేడర్ ఎటు వైపు వెళ్లాలో తెలియక మల్లగుల్లాలు పడ్డాయి. చివరికి తమకు అనుకూలమైన నేతల వద్దకు వెళ్లి అధినేతకు జైకొట్టారు. కొంత కాలంగా జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు, ఇతర సీనియర్లకు మధ్య గ్యాప్ కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఈ తేడాను అధిష్ఠానం గుర్తించింది. అప్పట్లో పార్టీలో కీలక నేతగా ఉన్న చాగంటి చిన్నను పిలిచి పవన్ మాట్లాడారు. నాయకర్ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఆ ఎన్నికల్లో నాయకర్‌తో కలిసి చిన్న పనిచేశారు. అప్పుడే పార్టీలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో కీలకమయ్యారు. ఆయనకే సీటు వస్తుందని అంతా అంచనా వేశారు. సమీకరణాల నేపథ్యంలో నాయకర్‌కు దక్కింది. అయినా నాయకర్ కోసం కొత్తపల్లి పనిచేశారు. దీంతో అంతా కలిశారని భావించారు. అయితే ఇది మూడునాళ్ల ముచ్చటగా మిగిలింది. కొంత కాలంగా ముఖ్యమైన కార్యక్రమాలకు తప్ప మాజీ మంత్రి కొత్తపల్లి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిన్నా కార్యాలయానికి వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత పుట్టినరోజు వేడుకలను ఎవరికి వారే ప్రత్యేకంగా కార్యక్రమాలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే నాయకర్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభిస్తే.. కొత్తపల్లి ఆయన నివాసం రుస్తుంబాద నుంచి, చిన్న ఆయన స్వగ్రామం లక్ష్మణేశ్వరం నుంచి పోటాపోటీగా ర్యాలీలు చేశారు.

పొంచి ఉన్న గండం


స్పిల్‌వే వద్ద మంగళవారం ఉరకలేస్తున్న గోదావరి

- వానలు తెరపిచ్చినా మళ్లీ భారీ వర్షాల భయం
- ఇప్పటికే ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- భద్రాద్రి వద్ద గంట గంటకు పెరుగుతున్న గోదావరి
- మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో వరద ప్రవాహం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకవైపు భారీ వర్షాలు. పొంగుతున్న వాగులు, వంకలు. తమ్మిలేరు, రామిలేరు ఉధృతి, కృష్ణ కాలువకు గండితో పరీవాహక ప్రాంతాలు, జాతీయ రహదారి నీట మునిగాయి. మరోసారి రానున్న 48 గంటల్లో భారీ, అతి భారీ వర్షాల హెచ్చరికతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో గోదావరి ఉరకలు వేస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గంట గంటకు ఉధృతి పెరుగుతోంది. ఆ నీరంతా దిగువన పోలవరం వైపు దూకుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను యంత్రాంగం అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులను కోరింది.

మరచిపోక ముందే మళ్లీ గండం

భారీ వర్షాలు ఏలూరు జిల్లాను గడగడలాడించాయి. కనీవినీ ఎరుగని రీతిలో నూజివీడు ధ్వంసమైంది. పెద్ద ఎత్తున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. మెట్టలోనే ఈ తరహా పరిస్థితి ఎదురవడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. నివాస గృహాలు దెబ్బతిన్నాయి. హాస్టళ్ళల్లోకి నీరు ముంచెత్తింది. చదువుకునే విద్యార్థులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. ఎక్కడికక్కడ చెరువులకు గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాలు నీట మునిగాయి. ఇప్పటికే ఖరీఫ్ ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉండగానే భారీ వర్షాలు రైతన్నకు కంట కన్నీరు రప్పించాయి. కొల్లేరు ప్రాంతంలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతోంది. కొల్లేరు సరస్సు అంతర్భాగంలో మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా తమ్మిలేరు, రామిలేరు, బుడమేరు వాగులు ఉప్పొంగడం, కృష్ణ కాలువ ద్వారా భారీగా వరద నీరు కొల్లేరుకు తరలింది. ఈ నీరంతా నేరుగా ఉప్పుటేరులో కలుస్తుంది. భారీ వరదలతో లంక గ్రామాల చుట్టూ ఇప్పటికే పూర్తిగా నీరు చేరింది. కొన్ని లంకలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్నింటికి ప్రమాదం పొంచి ఉంది. రెండు రోజులుగా వాన తెరపిచ్చింది. మంగళవారం నాటికి వాగుల్లోను ప్రవాహం తగ్గుముఖం పట్టింది.

వడివడిగా గోదావరి

వర్షాలు తెరపివ్వడంతో ఇప్పుడిప్పుడే కొంచెం ఊపిరి పీల్చుకుంటున్న జనం ముందు ఇంకో గండం పొంచి ఉంది. ఎగువన భారీ వర్షాలతో భద్రాద్రి వద్ద గోదావరి విశ్వరూపం దాల్చింది. గంట గంటకు నీటి మట్టం పెరుగుతోంది. గడిచిన రెండు నెలల్లో గోదావరికి వరద రెండోసారి వస్తున్నది. గోదావరి ఉరకలు, పరుగులతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరిలో 43 అడుగుల మేర నీటిమట్టం నమోదై 9.32 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవుతుంటే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతానికి భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మంగళవారం సాయంత్రం 40 అడుగులకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరికకు అత్యంత చేరువగా గోదావరిలో నీరు పెరుగుతుంది. గమనించిన అధికారులు ఎగువ నుంచి దిగువ వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గోదావరిలో 1986 నాటికి 75.60 అడుగుల మేర రికార్డు స్థాయిలో వరద నీరు ఉరకలేస్తే అప్పట్లో 27 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గోదావరి పరీవాహక చరిత్రలో ఇదే అత్యంత అరుదైన రికార్డు. 2022లో గోదావరి నీటిమట్టం 71.30 అడుగులకు పెరిగింది. 21 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైంది. రెండేళ్ల క్రితమే గోదావరి ఉధృతికి ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు అతలాకుతలమయ్యాయి. వందలాది మంది గిరిజనులు, గిరిజనేతరులు అటు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు పోలవరంలోను కొండల మీద విష సర్పాల మధ్యే బిక్కుబిక్కుమంటూ గడిపారు. అప్పట్లో ఎగువ కాఫర్ డ్యాం కారణంగానే గోదావరి వరద ముంపు మండలాలను ముంచెత్తిందనే వాదన తెరముందుకు వచ్చింది. అప్పటి సీఎం జగన్ రెడ్డి ఈ రెండు మండలాలను సందర్శించి బాధితులకు సాయం చేస్తామని ప్రకటించినా అది చివరికి నెరవేరలేదు. ఇటీవల భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్టు రిజర్వాయరు అప్రోచ్ కొట్టుకుపోయింది. ఎక్కడికక్కడ గ్రామాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. జిల్లా అధికారులు రంగంలోకి దిగి సమీక్షిస్తేనేగాని పరిస్థితులు చక్కబడలేదు. మళ్ళీ గోదావరికి వరద పోటు పొంచిఉంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేశారు.

కొల్లేటిలంక గ్రామాలకు ముప్పు

కైకలూరు-ఏలూరు రోడ్డుపైకి వస్తున్న వరద నీరు

మండవల్లి, సెప్టెంబరు 3 : ఎగువ నుంచి వివిధ డ్రెయిన్ల ద్వారా వరద నీరు కొల్లేరులో చేరడంతో కొల్లేటిలంక గ్రామా లకు ముంపు పొంచి ఉంది. కొల్లేరు లంక గ్రామాలకు ప్రధాన రహదారైన పెద్ద ఎడ్లగాడి, పెనుమాకలంక ఆర్‌అండ్‌బి రహదారి జలదిగ్బంధంలో చిక్కుకున్నా యి. ఏలూరు-కైకలూరు రహదారిపై వరద నీరు చేరుతోంది. వరద ఉధృతి కొనసాగితే కైకలూరు-ఏలూరు రాకపోకలు నిలిచిపోతాయని ఆందోళన వ్యక్తమ వుతున్నది. పెద్దఎడ్లగాడి వద్ద నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపుడెక్క, తూడును ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. తూడు తొలగింపు పనులు, ముంపు పరిస్థితిని తెలుగుదేశంపార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు.


పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేటి నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న తూడు, గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం


గుడివాకలంక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు కొల్లేరు వైపు దూసుకెళుతున్న దృశ్యం

కాల్వలు, నదులపై డ్రోన్స్ నిఘా



భీమవరం క్రైం, సెప్టెంబరు 3: జిల్లాలో అధిక వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, నదులు, చెరువుల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. డ్రోన్‌లు అందించిన ఫొటోలు ద్వారా గండి పడటానికి ఆస్కారం ఉన్న గట్లను గుర్తించి వాటి వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీని ద్వారా వరద ప్రమాదాలను ముందుగానే నివారించడానికి వీలవుతుందని ఎస్పీ పేర్కొన్నారు.


డ్రోన్ కెమేరాలతో పర్యవేక్షిస్తున్న పశ్చిమ పోలీసులు

గొర్రెల కాపరికి మంకీ పాక్స్ ?
చర్మంపై పొక్కులు
విజయవాడకు తరలింపు
అత్తిలిలో కలకలం - మెయిన్‌లో


త్రుటిలో తప్పిన ప్రమాదం

స్టీరింగ్ వదిలేయడంతో.. కాల్వలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు.. అందరూ క్షేమం 7

అర్చక ఆగమ పరీక్షకు దరఖాస్తులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 3 : దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అర్చక ఆగమ పరీక్షలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ ఆఖరని దేవదాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు, అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పురుషోత్తమాచార్యులు, వి.జానకిరామయ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోనివారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు.


విజయవాడకు ఆహారం తీసుకువెళ్తున్న వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

7 బాధితులకు అండగా..
పశ్చిమ నుంచి లక్షా 25 వేల ఆహార పొట్లాలు

సొసైటీలకు ఎంత కష్టం..!

- డేటా ఎంట్రీ కోసం రూ.1.50 లక్షలు కేటాయింపు
- ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు ఏజన్సీలకు బాధ్యతలు
- ఇక్కడ మాత్రం సిబ్బందికే విధులు
- రాత్రి పూట ఎంట్రీ చేయాలంటూ ఒత్తిళ్లు

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ సిబ్బందికి భారంగా మారింది. రాత్రిపూట విధులు నిర్వహిస్తున్నారు. డేటా ఎంట్రీని త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాత్రి పూట విధులు నిర్వహించాలంటూ ఆదేశాలు జారీచేస్తున్నారు. కార్యదర్శులకు ఫోన్‌లు చేస్తున్నారు. రాత్రిపూట విధుల్లో ఉన్నారో లేదో తెలుసుకుంటున్నారు. ప్రతిరోజు రాత్రి 12 గంటల దాకా డేటా ఎంట్రీ చేస్తున్నారు. సహకార సంఘాలతో సంబంధం ఉన్న అందరి రైతుల నుంచి ఆధార్‌కార్డులు తీసుకోవాల్సి ఉంటోంది. అయితే కొందరు రైతులు విముఖత చూపుతున్నారు. ఇప్పటిదాకా సొసైటీల్లో డిపాజిట్‌లు చేసిన రైతులు గోప్యంగా ఉంటున్నాయి. ఇకపై కంప్యూటరీకరణతో ఇకపై వివరాలు వెల్లడికానున్నాయి. ఇదే జరిగితే సొసైటీల్లో డిపాజిట్‌లు చేసేవారి సంఖ్య పడిపోతుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కొన్నేళ్ల నుంచి కంప్యూటరీకరణపై సహకార సంఘాల్లో చర్యలు తీసుకుంటున్నారు. రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటిదాకా సొసైటీలు నిర్వహించిన లావాదేవీలు అన్నింటిని కంప్యూటరీకరిస్తున్నారు. ఈ క్రమంలో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆధునీకరించాలని కేంద్రం భావించింది. అందులో భాగంగానే కంప్యూటరీకరణ చేసేందుకు చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ సొసైటీలు ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. అందుకోసం కేంద్రం నిధులు కేటాయించింది. సొసైటీల్లో డేటా ఎంట్రీ కోసం వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి సొసైటీకి రూ.1.50 లక్షలు వంతున మంజూరు చేసింది. సొసైటీ ఆ సొమ్మును వెచ్చించి డేటా ఎంట్రీ చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఏజన్సీలను ఏర్పాటు చేశారు. ఏజన్సీ సిబ్బంది వచ్చి డేటాను ఎంట్రీ చేస్తున్నారు.

రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా ఉందంటూ సొసైటీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ఉన్న రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఇప్పటికే సిబ్బంది కొరత ఉంటోంది. మరోవైపు ధాన్యం కొనుగోలుకు సిబ్బందిని కేటాయిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్, రబీ పంట కాలంలో నాలుగు నెలలపాటు సిబ్బంది ధాన్యం కొనుగోలులో తలమునకలై ఉంటున్నారు. అందుకు సంబంధించిన కమీషన్‌ను కూడా వైసీపీ హయాంలో సొసైటీలకు కేటాయించలేదు. ఆ భారాన్ని కూడా సొసైటీలో భరించే పరిస్థితి ఏర్పడింది. తాజాగా డేటా ఎంట్రీకోసం అధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతోంది. జిల్లాలో 114 సొసైటీలు ఉన్నాయి. ఇక్కడ ఏజన్సీని నియమించలేదు. సొసైటీ సిబ్బందితోనే డేటాను నమోదు చేయాలని చెపుతున్నారు. ప్రతి సొసైటీకి డేటా ఎంట్రీకోసం కేటాయించిన రూ. 1.50 లక్షలు ఏమయ్యాయో తెలియడం లేదంటూ సిబ్బంది లబోదిబోమంటున్నారు. ఆ సొమ్ములను కేటాయిస్తే ఏజన్సీ ద్వారా వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. సిబ్బందిపై భారం తప్పుతుంది. ఇతర రాష్ట్రాల్లో ఏజన్సీల ద్వారా డాటా ఎంట్రీలను పూర్తి చేస్తున్నారు. ఇక్కడ మాత్రం సొసైటీలపైనే భారం మోపుతున్నారంటూ ఆందోళన చెందుతున్నారు. తాజాగా సహకార శాఖ త్వరతిగతిన డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో సిబ్బంది ఘొల్లుమంటున్నారు.



రైతన్నా... ఎక్కడన్నా....

గతంలో రూ. 10లు చెల్లిస్తే సొసైటీల్లో సభ్యునిగా చేర్చుకునేవారు. ఇప్పుడు దానిని రూ. 300 చేశారు. సహకార సొసైటీల నుంచి రుణం కూడా తీసుకోవాలి. లేదంటే డిపాజిట్ చేయాలి. భూమి ఉండాలి. అటువంటి వారికే ఓటుహక్కు ఉంటుంది. అయితే గతంలో రూ.10లు చెల్లించి సభ్యునిగా చేరిన వారు ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. వారి వివరాలు సేకరించడానికి సొసైటీలు ఇబ్బంది పడుతున్నాయి. ఆధార్ కార్డులు తీసుకుని ప్రతి రైతు వివరాలు నమోదు చేయాలని సహకార సంఘాలకు ఆదేశాలు జారీచేశారు. సభ్యులంతా ఇప్పుడు అందుబాటులో లేరు. దాంతో డేటా ఎంట్రీ కష్టతరమవుతోంది. వైసీపీ హయాంలో సొసైటీ సిబ్బంది కష్టాలను చవిచూశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పు ఉంటుందని ఆశించారు. కానీ అదేతరహా ఒత్తిళ్లతో ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులనుంచి ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నామంటూ ఘొల్లుమంటున్నారు.




సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రోషన్..మంత్రి వనితతో కలిసి ఎమ్మెల్యే ఆరిమిల్లి

సహాయక చర్యల్లో మనోళ్లు..

భీమవరం టౌన్ సెప్టెంబరు 3 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సహాయ సహకారాలు అందించేందుకు విజయవాడకు తరలి వెళ్లారు. జిల్లాలోని అన్ని మునిసిపాల్టీల నుంచి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ పారిశుధ్యం, రెవెన్యూ శాఖల నుంచి సిబ్బంది వెళ్లారు. ఒక్కో మునిసిపాల్టీ నుంచి 60 మందిని తరలించారు. ఇక్కడి నుంచే పారిశుధ్యపనులు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కూడా వారు వెంట తీసుకువెళ్ళారు. మంచినీటి సరఫరా చేసేందుకు మునిసిపాల్టీల నుంచి ట్యాంకర్లను కూడా విజయవాడ తరలించారు.

తరలివెళ్లిన సిబ్బంది

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు నరసాపురం, తాడేపల్లిగూడెం మునిసిపాల్టీల నుంచి కమిషనర్లు, ఏసీపీలు, టీపీవోలు, ఎంఈలు, డీఈలు, ఏఈలతో పాటు పారిశుధ్య కార్మికులతో కలసి 300 మందిని తరలించారని అధికారులు చెబుతున్నారు. అక్కడకి చేరుకున్న అధికారులకు ప్రత్యేక విభాగాలను అప్పగిస్తున్నారు. మునిసిపాల్టీ నుంచి సుమారు 40 మంది చొప్పున పారిశుధ్య కార్మికులను తరలించారు. ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు నుంచి 20 మంది వైద్యాధికారులు, 40 మంది పారా మెడికల్ సిబ్బందిని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యసేవల నిమిత్తం పంపించామని డీఎంహెచ్‌వో వివరించారు.

విరాళాలకు సన్నాహాలు

వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ప్రకటించనున్నారు. దీనికి దాతలు, రాజకీయ పార్టీలు స్పందించనున్నాయి. ఇప్పటికే టీడీపీ నుంచి కూడా మార్గదర్శకాలు అందాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీనికి అనుగుణంగా నిధులు సేకరించి సీఎం చంద్రబాబుకు చెక్కు రూపంలో అందించేందకు చర్యలు చేపట్టనున్నారు.

టీడీపీ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు

తణుకు/ చింతలపూడి సెప్టెంబరు 3 : వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యేలను, పార్టీ ముఖ్య నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావులను విజయవాడలోని ఒక్కో డివిజన్‌లకు ఇన్‌చార్జిలుగా నియమించారు. విజయవాడలోని 32వ డివిజన్‌లో హోంమంత్రి వంగలపూడి అనితతో కలసి మంగళవారం ఎమ్మెల్యే రాధాకృష్ణ పర్యటించారు.విజయవాడ 44వ వార్డులో వరద సహాయ చర్యల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. బాధితులకు మంచినీరు, బిస్కెట్లు, పాలు, ఆహార పదార్థాలు అందించారు. భీమవరంలో దాతల సహకారంతో అందించిన 10 వేల ఆహార పొట్లాలతో కోళ్ళ నాగేశ్వరరావు విజయవాడ వెళ్ళారు.

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యల్లో పాల్గొని వరదలో చిక్కుకున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి రామారావు సహాయ చర్యల వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వివరించారు.



విజయవాడలో సహాయక చర్యలపై సీఎం వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామారావు



పులిహోర పొట్లాలను సిద్ధం చేస్తున్న ద్వారకాతిరుమల ఆలయ సిబ్బంది





భీమవరం ఎస్ఆర్‌కెఆర్ నుంచి వాహనానికి జెండా ఊపిన ఎమ్మెల్యే అంజిబాబు.. ఆకివీడులో ప్రారంభించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు .. బాధితులకు ఆహారాన్ని సిద్ధం చేయిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

మేమున్నామనీ..

మీకేం కాదనీ..

కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలవాలి..వారికి అండగా మేమున్నామనే భరోసా ఇవ్వాలి.. వరదల్లో ఇల్లు..వాకిలి ఏకమై నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు అండగా నిలుస్తున్నారు మనవాళ్లు.. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, దాతలు అందరూ తలో చేయి వేసి ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఆహారం,మందులు పంపుతున్నారు..ఇక్కడి నుంచి విజయవాడ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

పశ్చిమ నుంచి లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు

భీమవరం టౌన్, సెప్టెంబరు 3 : విజయవాడ వరద బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నారు.బాధితులను ఆదుకునేందుకు జిల్లా నుంచి సోమ, మంగళవారాల్లో 1 లక్షా 98 వేల 960 ఆహార పొట్లాలను పంపించారు. దీంతో పాటుగా 70 వేల వాటర్ ప్యాకెట్లు, లక్షా 15 వేల బిస్కెట్లు, వాటర్ బాటిల్స్, రస్కులు, బన్‌లు విజయవాడకు తరలించారు వెస్ట్ గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 9,800, భీమవరం ప్రాన్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్, చైతన్య గోదావరి 6 వేలు చొప్పున, గాదిరాజు సుబ్బరాజు, తిరుమల కాలేజీ, సంధ్యా మెరైన్స్ దేవదాయ శాఖ, ఎఫ్ఎఫ్‌డీ ఫుడ్ ఫ్యాక్ట్ కంపెనీ 5 వేలు చొప్పున, భీమవరం విష్ణు కాలేజీ, తాడేపల్లిగూడెం నంద్యాల కృష్ణమూర్తి 4 వేలు చొప్పున, ఆకివీడు చాంబర్ ఆఫ్ కామర్స్ 3,500 వేలు, హాట్ లైన్స్ బాబు, కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ 3 వేలు చొప్పున, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ 2,500, జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం 2 వేలు ఆహార పొట్లాలను మంగళవారం మధ్యాహ్నం నాటికి పంపారు. మంగళవారం రాత్రి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 6,700, తాడేపల్లిగూడెం ఎస్‌కె మెరైన్స్ 6 వేలు, తణుకు ఆంధ్రాసుగర్స్ దేవదాయశాఖ 5 వేల చొప్పున, ఇరగవరం వాన్ బెర్రి ఫార్మా కంపెనీ, ట్లక్స్ ఇండస్ట్రీ 4 వేల చొప్పున, లయన్స్ కృష్ణంరాజు, గాదిరాజు సుబ్బరాజు 3 వేల చొప్పున ఆహార పొట్లాలు అందించారు.

భీమవరం ఎడ్యుకేషన్ : విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున 5 వేల ఆహార పొట్లాలను, 1800 రస్కుల ప్యాకెట్లు, 4,500 రష్యన్ బన్ ప్యాకెట్లను అందించినట్లు డైరెక్టర్ స్టూడెంట్స్ అఫైర్స్ అడ్మినిస్ట్రేషన్, డాక్టర్ పి.శ్రీనివాస రాజు తెలిపారు. భీమవరం శ్రీసత్య సాయి సేవాసమితి రాయ ప్రోలు చలపతి బృందం 5 వేల బిస్కెట్ ప్యాకెట్లు, రస్కులు అందించారు. భీమవరం శ్రేయాస్ గ్రాండ్ ఇన్ హోటల్ డైరెక్టర్ యర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో 5 వేల పులిహోర ప్యాకెట్లు వ్యాన్‌ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు.

ఆకివీడు : ఆకివీడులో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఐదువేలు పైబడి బిర్యానీ పొట్లాలతో వెళ్ళుతున్న వాహనానికి ఎమ్మెల్యే కనుమూరి రఘు రామ కృష్ణరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కాళ్ళ : కాళ్ళకు చెందిన పారిశ్రామికవేత్త గాదిరాజు సుబ్బరాజు వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన సుమారు 8 వేల ఆహార ప్యాకెట్లను మంగళవారం ప్రత్యేక వ్యాన్‌లో విజయవాడకు పంపించారు. కాళ్ళ ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, పాల్గొన్నారు.



భీమవరంలో పులిహోర ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

ఉండి : ఉండి తహసీల్దారు కార్యలయం నుంచి 6 వేల ఆహార పొట్లాలు తరలించినట్లు తహసీల్దారు నాగార్జున తెలిపారు.

పాలకొల్లు అర్బన్/రూరల్ : పాలకొల్లు రేపాకవారి సత్రం, అత్యం సుబ్బయ్య గారి అన్నసత్రం, కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామివారి ఆలయం, గునుపూడి సోమేశ్వర స్వామివారి ఆలయం, పెనుగొండ నగరేశ్వర స్వామి ఆలయాల ఆధ్వర్యంలో 5 వేల బిర్యానీ పొట్లాలను తయారు చేయించి వ్యాన్ ద్వారా పంపించారు.

ఏలూరు జిల్లా నుంచి లక్షా 60 వేల ప్యాకెట్లు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 3: ఏలూరు జిల్లా నుంచి వరద సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఏలూరులో గోకుల్ కల్యాణ మండపం, పత్తేబాదలోని కేటరింగ్ సెంటర్లలో అల్పాహారం తయారీ ప్యాకింగ్ పనులన కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. మంగళవారం మరో లక్షా 60 వేల ఆహార పొట్లాలను ఎన్టీఆర్ జిల్లాకు పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయం అల్పాహార ప్యాకెట్లును ప్రత్యేక వాహనాల్లో పంపామన్నారు. మధ్యాహ్నం, సాయంత్రానికి అవసరమైన భోజన ప్యాకెట్లు కూడా సిద్ధం చేసి విజయవాడకు పంపుతున్నట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి , ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ , దెందులూరు తహసీల్దార్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : ఏలూరు ఎమ్మెల్యే బడేటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో 40 వేల ఆహార ప్యాకెట్లు తయారు చేసి విజయవాడకు తరలించారు. మంగళవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాలకు పంపించాం. బుధవారానికి కూడా ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నామని మేయర్ తెలిపారు.

పెదవేగి/ పెదపాడు : పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎన్టీఆర్ జనతా క్యాంటీన్‌లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 50 వేల మందికి సరిపడా ఆహారాన్ని బాక్స్‌ల్లో పెట్టి విజయవాడ తీసుకెళ్ళి వరద బాధితులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ 22వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా తాను బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం 50 వేలమందికి ఆహారాన్ని అందించామని, బుధవారం మరో 50 వేలమందికి ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు నుంచి ఆరు వేల ఆహార పొట్లాలను తరలించారు.

ద్వారకాతిరుమల/ జంగారెడ్డిగూడెం : ద్వారకాతిరుమల దేవస్థానం 10,500 పులిహోర ప్యాకెట్లను, 14 వేల మంచినీటి ప్యాకెట్లను రెండు వ్యాన్‌ల ద్వారా విజయవాడకు పంపారు. మద్ది ఆంజనేయస్వామి క్షేత్రం నుంచి 5 వేల పులిహోర ప్యాకెట్లను పంపినట్లు ఈవో కొండలరావు తెలిపారు.

నూజివీడు/ కలిదిండి : మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుతో నూజివీడు నాయకులు 3 వేల ఆహార పొట్లాలను విజయవాడ పంపించారు. నూజివీడు డివిజన్ నుంచి సోమ, మంగళవారాల్లో 47 వేల ఆహార ప్యాకెట్లను తయారు చేయించి విజయవాడ తీసుకువెళ్లే వాహనాన్ని ఆర్డీవో వై.భవానిశంకరి జెండా ఊపి పంపారు. కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రెండు వ్యాన్‌లలో 2 వేల ఆహార పొట్లాలు తరలించారు. కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆహార ప్యాకెట్ల వ్యాన్లను తహసీల్దార్ రామకృష్ణ ప్రారంభించారు.



ఏలూరులో వాహనాన్ని పంపుతున్న మేయర్ నూర్జహాన్



భీమవరంలో వాహనంలోకి బ్రెడ్‌లను తరలిస్తున్న విద్యార్థినులు



ఉండిలో ఆహారం తయారు చేయిస్తున్న తహసీల్దారు నాగార్జున, సీఎస్‌డీటీ మహేష్

మనవాళ్లు ఎలా ఉన్నారో..?

వరద ప్రాంతాల్లో ఉన్న వారిపై బంధువుల్లో ఆందోళన

ముదినేపల్లి, సెప్టెంబరు 3 : విజయవాడలో వరదల్లో చిక్కుకున్న తమ వారి యోగ క్షేమాలను తెలుసుకునేందుకు ముదినేపల్లి ప్రాంతంలో ఉన్న వారి కుటుంబీకులు, బంధువులు ఆదుర్దా పడుతున్నారు. విజయవాడలోని సింగ్ నగర్, రామలింగేశ్వర నగర్, ఇబ్రహీంపట్నం, కృష్ణలంక, రామవరప్పాడు బుడమేరు వెంబడి భారీగా వరద వచ్చిన ప్రాంతాల్లో ముదినేపల్లి మండలం వాడవల్లి, పెద గొన్నూరు, శ్రీహరిపురం తదితర గ్రామాలకు చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటున్నాయి. సుమారు 50 కుటుంబాలు రామలింగేశ్వరనగర్‌లో ఉంటున్నారు. ఇళ్లల్లోకి వరదనీరు రావటంతో విజయవాడలో బంధువుల ఇళ్లలో కొందరు తలదాచుకుంటుండగా, మరి కొందరు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్లి ఆశ్రయం పొందుతున్నారు. వరద ప్రాంతాల్లో విద్యుత్ లేక సెల్‌ఫోన్లు కూడా పని చేయకపోవటంతో ఇక్కడి వారు మరింత కంగారు పడుతున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు ఫోన్లు చేసి కూడా సమాచారం తెలుసుకుంటున్నారు.

నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

పెదవేగి, సెప్టెంబరు 3 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 4వ తేదీన జరగాల్సిన ఎంపిక పోటీలను వర్షం, వరదల కారణంగా వాయిదా వేశామని అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. 4వ తేదీన పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారని 4వ తేదీన జరిగే పోటీలను మాత్రమే వాయిదా వేశామని, మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 6వతేదీ శుక్రవారం నుంచి 21వ తేదీ సోమవారం వరకు యధాతధంగా జరుగుతాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ఆయా చోట్ల జరిగే పోటీలకు హాజరు కావాలని జయరాజు సూచించారు. 4వ తేదీన జరగాల్సిన పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపర్చుతామని తెలిపారు.



ఉప్పుటేరు వంతెనపై..

సందట్లో సడేమియా..

ఆకివీడు రూరల్/ పెదపాడు : సందట్లో సడేమియాలా వరదనీటిలో చేపలవేట సాగిస్తున్నారు మత్స్యకారులు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామ సరిహద్దులో ఉన్న ఉప్పుటేరు రోడ్డు వంతెనపై నుంచి మత్స్యకారులు మంగళవారం వేట సాగించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొల్లేరులోకి భారీగానీరు వచ్చి చేరుతుండటంతో చెరువుల్లోని చేపలు ఉప్పుటేరులోకి వస్తున్నాయని మత్స్యకారులు వల వేస్తున్నారు. సుమారు 4 నుంచి 5 కిలోల చేపలు పడ్డాయి. వాహన దారులు చేపలను కొనుగోలు చేసేందుకు నిలవడంతో వంతెనపై రద్దీ ఏర్పడింది. రామిలేరులో నీటి ఉధృతి తగ్గడంతో కొత్తనీటిలో పైనుంచి వచ్చే చేపల కోసం యువకులు పెద్దఎత్తున వెతుకులాట ప్రారంభించారు. చేపల కోసం గట్టుపై వేచి చూసేవారి సంఖ్య కూడా అలానే ఉంది. పెద్ద చేపలతో పాటు చిన్న పరికె చేపలు కూడా హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోయాయి.



రామిలేరులో..

క్రైం కార్నర్..



దిరుసుమర్రు రోడ్డులో పంట బోదెలోకి దూసుకెళ్ళిన ప్రైవేటు బస్సు

పంట బోదెలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : భీమవరం పట్టణ శివారు దిరుసుమర్రు రోడ్డులో రొయ్యల కంపెనీ కార్మికులు వెలుతున్న ప్రైవేటు బస్సు అదుపు తప్పింది. సుమారు 30 మందితో వెళుతున్న బస్సు స్టీరింగ్ వదిలేయడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకెళ్ళినట్లు చెబుతున్నారు. బస్సు బోల్తా కొట్టి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. దిర్సుమర్రు రోడ్డులో ఎక్కువగా రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలు ఉన్నాయి. ఆ కంపెనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందినవారు, భీమవరం చుట్టుపక్కలవారు సుమారు 2 వేలు మందికి పైగా పనిచేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులు, వ్యానులు, ఆటోలు ప్రయాణానికి వినియోగిస్తున్నారు. అందువల్ల వారి ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. అధికారులు స్పందించి వాహనాలకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ బస్సు స్టీరింగ్ వదిలివేయడం వల్ల అదుపు తప్పి పంట బోదెలోకి దూసుకెళ్ళిందని ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3 : రైలు పట్టాలు దాటుతున్న ఒక వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో ఫ్లైవర్ ఓవర్ బ్రిడ్జి కింద ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి బుజ్జిరాజు (72) మంగళవారం ఉదయం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంగాయిగూడెంలో బంగారం చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళి వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన కారెం విజయ గత నెల 28వ తేదీన తన ఇంటికి తాళం వేసి దుగ్గిరాలలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్ళారు. ఆమె తిరిగి ఈనెల 2వ తేదీ రాత్రి వచ్చారు. ఇచ్చేటప్పటికి ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ మదీనా బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాందువ్వ వినాయకుడి గుడిలో హుండీ చోరీ



ఉండి సెప్టెంబరు 3: ఉండి మండలం పాందువ్వ గ్రామంలోని వినా యకుడి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు ప్రవేశించి హుండీలో నగదు దొంగిలించారు. సుమారు లక్ష రూపాయల వరకు నగదు వుంటుందని ఆలయ కమిటీవారు అంటున్నారు. వినాయకుడి గుడి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించి హుండీని తెరచి అందులోని నగదు చోరీ చేశారు. మరో నాలుగు రోజుల్లో వినాయక చవితి పండుగకు సిద్ధం కానుండగా చోరీకి గురికావడంపై కలకలం రేగింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి విచ్చేసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్..రూ.10 వేలు జరిమానా

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : గత నెల 31న భీమవరం వన్‌టౌన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన జోగి నవీన్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా నిర్ధారణ అయింది. అతనిని భీమవరం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజారావు వద్ద హాజరుపరచగా రూ.10 వేలు జరిమానా విధించారని వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగరాజు తెలిపారు.

భీమవరంలో చేపల వ్యాపారి మోసం

సుమారు రూ.10 కోట్లకు పైగా రైతులకు ఎగనామం

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : భీమవరం పట్టణంలో ఒక చేపల వ్యాపారి, వైసీపీ నాయకుడు చేపల రైతులకు సుమారు రూ.10 కోట్లు వరకు బాకీ ఉండటంతో బాధితులు మంగళవారం వ్యాపారి ఇంటి వద్ద ఆందోళనకు దిగినట్టు సమాచారం. వివరాల్లోకి వెళితే ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసం ఉండే వైసీపీ నాయకుడు కొన్నేళ్ళుగా చేపల వ్యాపారం చేస్తున్నారు.గతంలో ఒక ప్రజాప్రతినిధి అండదండలతో రైతుల సొమ్ములు సుమారు రూ.6 కోట్ల వరకు ఎగ్గొట్టాడు. ఎవరైనా గట్టిగా అడిగితే బెదిరించేవాడు. అదలా ఉంటే మళ్లీ సుమారు రూ.8 కోట్లు వరకు రైతులకు బకాయిలు ఉండగా తప్పించుకుని తిరుగుతున్నట్లు చెబుతున్నారు. మంగళవారం ఆ వ్యాపారి ఇంటి వద్ద కొందరు ఆందోళన చేస్తుండగా పోలీసులు రంగ ప్రవేశం చేశారు. భీమవరంలో మరో రొయ్యల వ్యాపారి ఎగనామం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. బాధితులు అతని చుట్టూ తిరుగుతూ ఉన్నా కూడా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనిపై వన్‌టౌన్ సీఐ నాగరాజును వివరణ కోరగా డబ్బులు ఇవ్వకుండా ఒక వ్యక్తి మోసం చేసినట్లుగా కొంతమంది ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చారని పూర్తి వివరాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3 : ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రామానుజపురంలో నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈటీ ఇన్‌స్పెక్టర్ గిరిజాకుమారి తెలిపారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామానుజపురంలో దాడులు నిర్వహించగా వీరమల్లు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వెంకటలక్ష్మి, సిబ్బంది పిలిప్స్, ప్రసాద్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : తన భర్త, అత్తమామ, ఆడపడుచు, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం అనాకోడేరు పంచాయతీ ఈలంపూడి గ్రామానికి చెందిన ఇళ్ళ లక్ష్మీ రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. లక్ష్మీకి అదే గ్రామానికి చెందిన సత్యనారాయణతో 2018లో వివాహమైంది.3 లక్షలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలంగా అదనంగా కట్నం తీసుకురమ్మని వేధిస్తుండటంతో ఫిర్యాదు చేశారు.

నేత్రదానంపై అవగాహన ఉండాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, సెప్టెంబరు 3 : చనిపోయిన తర్వాత మన నేత్రాలతో వేరొకరికి వెలుగులు నింపేందుకు.. నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్, భీమవరం శాఖ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విష్ణు కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి ఈనెల 8 వరకు నిర్వహిస్తున్నామన్నారు. అంధత్వ నివారణ కోసం పెద్దఎత్తున అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించి నేత్రదానంపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నేత్రదానంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. భీమవరం ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, గ్లోబల్ సర్వీస్ కో-ఆర్డినేటర్ లయన్స్ ఇంటర్నేషనల్ సీహెచ్ కృష్ణంరాజు, పీజే మూర్తిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, డాక్టర్ పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

విమర్శించే అర్హత 'కొట్టు'కు లేదు : బొలిశెట్టి


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 3: తమ హయాంలో కనీసం రహదారులపై గోతులు కూడా పూడ్చలేని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు తనను విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు వేడుకలకు తాను సింగపూర్ వెళితే పేకాడటం కోసం వెళ్లానని కొట్టు ఆరోపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కష్టపడి సంపాదించిన సొమ్ము నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నానని, కమీషన్లు తీసుకుంటున్నానని చెప్పిన వారిని మీడియా ముందుకు తీసుకురావాలని, దమ్ముంటే ఓపెన్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. బొలిశెట్టి రాజేష్, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, తోట రాజ, నీలపాల దినేష్ పాల్గొన్నారు.

రక్తసేకరణలో రికార్డుల సొంతం భేష్..

డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం పలు రికార్డులను సొంతం చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాను సింగపూర్‌లో ఉన్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కూటమి నాయకులతో పాటు మెగా ఫ్యాన్స్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ కేవలం ఐదు గంటల్లో 967 యూనిట్ల రక్తాన్ని సేకరించి రికార్డులను సొంతం చేసుకోవడం కష్టానికతగ్గ ప్రతిఫలంగా భావిస్తున్నామన్నారు.

రైతుల మేలు కోసం పొలం-బడి : నాయకర్

నరసాపురం టౌన్, సెప్టెంబరు 3: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలు, పథకాల, సాగులో ఆధునిక పద్ధతులను తెలుసుకునేందుకే పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. మంగళవారం ఆయన వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారితో కలిసి పొలంబడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇటీవల వర్షాలు, వరదలు కారణంగా 3, 4వ తేదీల్లో జరగాల్సిన పొలంబడి వాయిదా పడిందన్నారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు జరుతాయన్నారు. రైతులు ముందస్తు సాగు సమాచారం, సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం తదితర విషయాలను తెలుసుకోవచ్చన్నారు. ఏఈవో నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షల విరాళాల సేకరణే లక్ష్యం


విరాళాలను సేకరిస్తున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రూ. 10 లక్షలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. వలవల బాబ్జి రూ. లక్ష అందించేందుకు ముందుకు వచ్చారు. తొలిరోజు పాతూరుకు చెందిన దాట్ల జగన్నాథరాజు, తాటికాయల వీరన్న, శ్రీరాముల నాగేశ్వరరావు రూ. 10,116 విరాళాన్ని బాబ్జికి అందజేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, గంధం సతీష్, పీతల సత్యనారాయణ, పంతం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు డెస్నీ



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 3: జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలకు తాడేపల్లిగూడెంకు చెందిన సొంగా డెస్నీ ఎంపికైనట్టు కోచ్ జె. నాని కమలాకర్ వెల్లడించారు. ఇప్పటికే ఈమె పోటీలకు సన్నద్ధమయ్యేందుకు అనంతపూర్‌లోని ఆర్డీటి స్టేడియంలో శిక్షణ పొందుతోంది.

పిప్పరలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

గణపవరం, సెప్టెంబరు 3: ప్రతీ ఒక్కరు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి కె. ప్రియాంక అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీ హెచ్ఈవో జీ.వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ అన్నకుమారి, హెచ్‌వీ సుబ్బలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు ఎస్.రాజు, అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పెనుగొండ, సెప్టెంబరు 3 :** సిద్ధాంతం జడ్పీ ఉన్నత పాఠశాలకు డిప్యూటీ సీఎం పవన్ జన్మదినం పురస్కరించుకుని జనసేన సీనియర్ నాయకులు దార్లంక మారుతి సూర్యఘన ప్రసాద్ , ఆచంట మందేశ్వర రావు సంయుక్తంగా సుమారు రూ.30 వేల విలువ చేసే రెండు మైక్రో స్కోప్‌లను టీడీపీ యువ నేత పితాని వెంకట్ ఆధ్వర్యంలో అందజేశారు.
- **ఆకివీడు :** రోజువారీ సంతకు చెందిన కూరగాయల దుకాణానికి మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించగా 2027 వరకు తోట సాయిలహరి నెలకు రూ.6,300 చెల్లించేలా పాడుకున్నారని మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.
- **మొగల్తూరు :** మొగల్తూరు మంచినీటి ప్రాజెక్టులో మరమ్మతుల కారణంగా బుధవారం మొగల్తూరు పంచాయతీ టౌన్ పరిధిలో కుళాయి నీరు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.
- **పెనుగొండ :** వడలి గ్రామ సచివాలయంలో బుద్ధుడు హాస్పిటల్ వారి సౌజన్యంతో డాక్టర్ సజ్జా శ్వేత ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి రాజమండ్రి కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు.
- **ఆచంట :** ఉప ముఖ్యమంత్రి పవన్ జన్మదిన వేడుకలు కర్ణాటక రాష్ట్రంలో ఆచంటకు చెందిన జనసేన పార్టీ ఎంపీటీసీ దాసిరెడ్డి పుణ్యవతి భర్త ప్రసాద్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం శిరివార్ జిల్లా బాగాలవాడలో ఉన్న విజయభారతి స్కూలులో 200 మందికి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందించి, భోజనాలు పెట్టారు.
- **తణుకు :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందుల షాపు సంయుక్తంగా మంగళవారం సంఘ కార్యాలయంలో డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు 36 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.
- **ఆకివీడు :** మూలలంక బోదె ఆక్రమణదారులకు ఎమ్మెల్యే రఘురామ ఆదేశాల మేర బుధవారం 73 కుటుంబాలకు నోటీసులు జారీ చేస్తామని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.
- **తణుకు :** ధరల నియంత్రణలో బీజేపీ విఫలమైందనిమంగళవారం తణుకు నరేంద్రసెంటర్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అన్నారు.
- ఉండి: కోలమూరులోని పాత రైస్‌మిల్లు వద్ద మంగళవారం పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.


దుంపగడపలో మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జేసీ, తదితరులు


చినకాపవరంలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామ


రుస్తుంబాదలో వరి పనలను పరిశీలిస్తున్న ఎంఏ షరీఫ్, పొత్తూరి, కొవ్వలి

ముంపు నీటిని దిగువకు పంపించండి : జేసీ

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 3 : ముంపునీరు త్వరితగతిన దిగువకు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుంపగడపలో నీట మునిగిన వరిపొలాలను డీఏవో వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఉప్పుటేరు బ్యాక్‌వాటర్ వల్ల వరి పొలాల్లోని నీరు బయటకు వెళ్ళడం లేదనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన కిక్కిస, గుర్రపుడెక్క ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రెయినేజీ జేఈ వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే అధికారులతో తూడు, కిక్కిస తొలగింపుపై చర్చిస్తానని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడు : ఎగువ నుంచి పంట, మురుగు కాల్వలకు వరద నీరొచ్చినా ముంపు సమస్యలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం సమతానగర్‌లోని చెంచుల కాలనీని ఆయన పరిశీలించి మాట్లాడారు. పల్లపు ప్రాంతాలు, కాలనీల ప్రజలకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అయి-భీమవరం రోడ్‌లోని మూలలంక బోదెకు అనుకుని ఉన్న ఆక్రమణదారులకు నోటీసులిచ్చి తొలగించాలని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావులను ఆదేశించారు.

వేసవి నాటికి పంట కాల్వల ఆధునికీకరణ : షరీఫ్

నరసాపురం రూరల్ : భారీ వర్షాలు, వరదలకు రైతులు నష్టపోకుండా పంట కాల్వలు, డ్రెయినేజీలు వేసవి నాటికి ఆధునికీకరిస్తామని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. మంగళవారం మండలంలోని నీట మునిగిన పంట పొలాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం షరీఫ్ విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ళకాలంలో పంట కాల్వలో పూడిక పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చూస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొవ్వలి నాయుడు మాట్లాడుతూ తక్షణం నియోజకవర్గం లోని మురికికాల్వలను సర్వే చేసి ఆధునీకరణ జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. వాతాడి ఉమా, జక్కం శ్రీమన్నారాయణ, ముక్కు బాబూరావు, ఆకన సుబ్రహ్మణ్యం, వీరస్వామి, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

• పాలకోడేరు/పాలకొల్లు రూరల్/మొగల్తూరు/ఉండి : ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరిపంట పొలాలను పాలకోడేరు గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని ముంపునకు గురైన వరి పంట పొలాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్. శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి నారాయణరావు, సహాయకులు కె. సూర్యకృష్ణ, బీఎల్ స్వరూపరత్నం తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు రూరల్ గ్రామాలైన ఆగర్రు, ఆగర్తిపాలెం, దిగమర్రు, లంకలకోడేరు, వెలివెల, శివ దేవుని చిక్కాలలో ఏడీఏ అడ్డాల పార్వతి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయాధికారి కె.రాజశేఖర్, సిబ్బంది, వీఆర్‌వోలు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు కోట రోడ్డు, గొల్లగూడెంలతోపాటు ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోవడంతో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంజన్లతో నీటిని బయటకు తోడిస్తున్నారు. మంగళవారం నీట మునిగిన వరి చేలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఉండి మండలం యండగండిలో యనమదుర్రు డ్రెయిన్ గట్లను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. డ్రెయిన్ ఆనుకుని వున్న చేలు ముంపుబారిన పడ్డాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపునకు చర్యలు

» శాశ్వత పరిష్కారానికి సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 3 :ఉప్పుటేరులో రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, కిక్కిస తొలగించడానికి యుద్ధ ప్రాతిప దికన చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తెలిపారు. మంగళవారం డ్రెయినేజీ శాఖ అధికారులతో కలిసి ఆయన ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన వద్ద పేరుకుపోయిన కిక్కిస, గుర్రపుడెక్క ప్రాంతాన్ని పరిశీలించి వివవరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువ కురిసిన వర్షాలకు వరద నీరు ఈ ఉప్పుటేరు ముఖద్వారం వద్దకు వచ్చిచేరుతుందని, ఈలోపు ఇక్కడ పేరుకుపోయిన గుర్రపుడెక్క, కిక్కిస తొలగించాలన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజల సహకారంతో కిక్కిస తొలగించి నీటి ప్రవాహాన్ని పెంచేవిధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కొల్లేరులోకి వచ్చే వరద నీటిని 64 కిలోమీటర్లు ప్రయాణించి సముద్రంలోకి తీసుకువెళ్ళే ఉప్పుటేరులో కిక్కిస మేటలు వేసిందని, ప్రతిఏటా దీనివల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈలోపుగా ప్రతిమూడు నెలలకోసారి తొలగించేవిధంగా ప్రణాళిక చేస్తామని తెలిపారు. పంటు ఏర్పాటు చేసి ఎక్స్‌కవేటర్ ద్వారా తూడు తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. డ్రెయినేజీ ఈఈ సుబ్రహ్మణ్యం, జేఈ వెంకటేశ్వరరావు, తహసీల్దారు వెంకటేశ్వరరావు, మోటుపల్లి రామవరప్రసాద్, నౌకట్ల రామారావు, జుత్తిగ శ్రీను, పి.శ్రీనివాసరాజు, మంతెన నరసింహరాజు, గంధం ఉమా, జాకీర్, నౌకట్ల రామారావు, అజమాల్, రంభ శివ తదితరులున్నారు.







తుందుర్రు పీహెచ్‌సీ వద్ద, పాలకోడేరులో ఆశా వర్కర్ల ఆందోళన.. పెనుమంట్రలో వినతి పత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

జూనియర్ డాక్టర్ హత్యాచారం దోషులను శిక్షించాలి

» ఆశా వర్కర్ల ఆందోళన » సమస్యల పరిష్కారంపై ప్రభుత్వమిచ్చిన హామీలు అమలు చేయాలని వినతి పత్రాలు అందజేత

భీమవరం రూరల్, సెప్టెంబరు 3:కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్స్, అన్ని ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ మండలం తుందురు పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లకు ప్రభుత్వమిచ్చిన హామీల జీవోలను విడుదల చేయాలని వినతిపత్రాన్ని డాక్టర్ దయామణికి అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు విమలకుమారి, ఏఎన్ఎం రత్నకుమారి, ఎంపీ సుందరి, పి.ఉషాకుమారి, చిట్టిమేరి, గౌరి పాల్గొన్నారు.

పాలకోడేరు/మొగల్తూరు/కాళ్ల/పెనుమంట్ర : జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిపై కఠిన శిక్ష విధించాలని కోరుతూ పాలకోడేరు గ్రామంలో ఆశావర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాతో పాటు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. ఆశావర్కర్ల నాయకురాలు లారెన్స్‌తో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సీఐటీయూ నాయకుడు తెలగంశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో పి.బేబికుమారి, ఎం.సిహెచ్ సౌజన్య, రేవతి, సత్యవతి, దుర్గా, విజయలక్ష్మి పాల్గొన్నారు. కాళ్ల మండలం కాళ్ళ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి జిల్లాలో జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సునీల్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అన్ని గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం ఆలమూరు పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులను శిక్షించాలని, ఆశ వర్కర్లకు ప్రభుత్వ హామీలు అమలు చేయాలని ఆందోళన చేశారు. సీఐటీయూ పెనుమంట్ర మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాదు. కౌలురైతు జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు, ఆలమూరు పీహెచ్‌సీ ఆశా వర్కర్లు. డి.లక్ష్మి, పి.తులసీదుర్గ, పి.మంగి, బి.మేరీ కుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత హరిశ్చంద్రప్రసాద్


హరిశ్చంద్రప్రసాదు విగ్రహం వద్ద నివాళులు

తణుకు, సెప్టెంబరు 3: ప్రముఖ పారిశ్రామిక డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ తణుకు ప్రాంత అభివృద్ధి ప్రదాత అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బసవా రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ అన్నారు. మంగళవారం హరిశ్చంద్రప్రసాద్ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, ఒమ్మి రాంబాబు, టి.మారుతీరావు పాల్గొన్నారు.

దుంపగడపలో రక్త నమూనాల సేకరణ

ఆకివీడురూరల్, సెప్టెంబరు : ఆకివీడు మండలంలో రక్తనమూనాల సేకరణ మంగళవారం చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన పాథాలజిస్టు డాక్టర్ శృతి రక్త నమూనాలు సేకరించి, డెంగీ ఫీవర్ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రానికి 26 మంది జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త సేకరించినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెంలో పరీక్షలు నిర్వహించి నివేదిక పంపుతామని తెలిపారు. వైద్యులు భువన, రాజశేఖర్, రమేష్ సీహెచ్‌వో, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రకాష్ తదితరులున్నారు.

కేవీకే శాస్త్రవేత్తలు పొలాల పరిశీలన

పెంటపాడు, సెప్టెంబరు 3: మండలంలోని రావిపాడు, చింతపల్లి గ్రామాల్లో ఏవో పార్థసారథి ఆధ్వర్యంలో ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.మల్లికార్జునరావు, పి.వినయలక్ష్మి, బి.రజిత మంగళవారం పొలాలను పరిశీలించారు. పొలాల్లో జింకు లోపం గమనించామని, నివారణకు ఎకరానికి జింక్ సల్ఫేట్ 100 గ్రాముల పౌడర్‌ను 150 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు బయటకు తోడిన తరువాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాషియం చల్లుకోవాలన్నారు. వీఏఏలు నాగేంద్ర, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, సెప్టెంబరు 3: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 5న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వైద్యులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్‌తో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం : సీఐ

భీమవరం అర్బన్, సెప్టెంబరు 3: వినాయక చవితి ఉత్సవాలో మట్టి గణనాథుల ప్రతిమలను పూజించి కాలుష్యాన్ని నిర్మూలిద్దాం అని టూటౌన్ సీఐ కాళీ చరణ్ పిలుపునిచ్చారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలోని విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించి గణేష్ మట్టి వినాయకులనే పూజించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులకు మట్టి వినాయకుల ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, సభ్యులు వేమిరెడ్డి హరికృష్ణ, కార్మూరి నరసింహమూర్తి బాబులు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలా గణపవరం-భీమవరం రహదారి


డ్రెయినేజీలో సిల్టు తొలగిస్తున్న దృశ్యం

గణపవరం, సెప్టెంబరు 3:నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సరిపల్లెలోని గణపవరం-భీమవరం రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు సరిపల్లె గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఎక్స్‌కవేటర్‌తో ఆర్అండ్‌బీ డ్రెయిన్లలో సిల్టు తొలగించే పనులు చేపట్టారు. గణపవరం-భీమవరం రహదారిలోని సరిపల్లె గ్రామం వద్ద రోడ్ల పైకి మోకాల్లోతు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు ప్రజలు కూడా అనేక అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంచాయతీ సర్పంచ్ చనుమూరి లక్ష్మీభవాని, పంచాయతీ కార్యదర్శి టీ.రామాం జనేయులు, సిబ్బంది డ్రైన్‌లోని షిల్టును తొలగించే కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థులకు సైకిళ్ల వితరణ



తణుకు, సెప్టెంబరు 3: సేవ చేయడం లోనే సంతృప్తి ఉంటుందని ఉప విద్యా శాఖాధికారులు మురళి, హైమవతి అన్నారు. మంగళవారం తేతలి జడ్పీ హైస్కూల్లో పని చేస్తున్న ఉపా ధ్యాయుడు బి.ఎం.గోపాలరెడ్డి, తణుకు నెం.5 హెచ్ఎం రుద్రమదేవి దంపతులు తండ్రి బాపతు చిన్నారెడ్డి స్మృత్యర్థం ప్రతిభగల 13 మంది విద్యార్థులకు సైకిళ్ళు అందజేశారు. పలు పాఠశాలల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరాలపై పూర్తిస్థాయి సర్వే చేయాలి : డీఎంహెచ్‌వో


లంకలకోడేరు పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వరరావు

పాలకొల్లు రూరల్/ అత్తిలి, సెప్టెంబరు 3: పీహెచ్‌సీ పరిధిల్లోని గ్రామాల్లో జ్వరాలపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు ఆదేశించారు. పాలకొల్లు రూరల్ లంకలకోడేరు పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జ్వరాలు నమోదు ఎలా ఉంది. జ్వరాల బారిన పడిన వారికి చికిత్స ఏవిధంగా అందుతోంది వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా కిట్లను వినియోగించి పరీక్షలు చేయాలన్నారు. డెంగీ జ్వరంగా గుర్తిస్తే మేక్ ఎలిసా పరీక్షకు తణుకు సిఫార్సు చేయాలని సూచించారు. డాక్టర్ ప్రతాప్‌కుమార్, డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, అమలేశ్వరరావు, కమల ఉదయ్‌చందర్, పీవీ స్వామి, రమేష్ బాబు, ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు. అత్తిలి మండలం అత్తిలి పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. నాగరాజు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. కుమారి మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న పిల్లల వివరాలను తెలుసుకుని వెంటనే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సీహెచ్‌వో మురళీ, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

నరసాపురం, సెప్టెంబరు 3: ప్రజలు జ్వరాలబారిన పడకుండా అన్ని ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో అంబరీస్‌ను కోరారు. మంగళవారం ఆర్డీవోకు శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు వినతిపత్రం అందించారు. టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలోని సమస్యలను ఆర్డీవోకు వివరించారు. జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, హసేన్, జక్కం కాశీ, కోరాడా పాపారావు, మౌలాలీ, సంగాని వెంకటేశ్వరావు పాల్గొన్నారు..

శానిటేషన్‌ను మెరుగుపర్చాలి : బీజేపీ వినతి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 3:పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని, ఎక్కడ చూసిన జ్వరాలతో బాధపడుతున్నారని, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని బీజేపీ నాయకులు కమిషనర్ అంజయ్యకు విన్నవించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునికోటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నాయకులు మార్యదపూర్వకంగా కలిసి బొకే అందించారు. త్వరలో అన్ని వార్డుల్లో పర్యటించి సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గునిశెట్టి శ్రీనివాస్, వెంకట్, రావూరి ప్రసాద్, వనమాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





తాడేపల్లిగూడెం, భీమవరం నుంచి ఆహార పొట్లాలు పంపిస్తున్న 3ఎఫ్ యాజమాన్యం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు

వరద బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ

పెంటపాడు/భీమవరం అర్బన్, సెప్టెంబరు 3: ఆపదలో ఉన్న వారికి బాసటగా నిలవాలని 3ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఓపీ గోయెంకా అన్నారు. విజయవాడ వరద బాధితులకు మంగళవారం 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 వేల ఆహార పొట్లాలను వ్యాన్‌పై విజయవాడ తరలించారు. తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, జున్నూరు జనార్దన్, సత్యనారాయణ, వేమల శ్రీనివాస్, శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. బాధితుల కోసం ఆహారం వండించి పొట్లాలను మంగళవారం పంపించారు. కుటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే తాత్కాలిక తరగతి భవనాలు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 3: ప్రభుత్వ నిర్ణయం మేరకే తాత్కాలిక తరగతి భవనాలకు ప్రతిపాదనలు పంపించామని ఆక్వా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.నీరజ స్పష్టం చేశారు. మంగళవారం లక్ష్మణేశ్వరం గ్రామ కళాశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. పరిపాలన భవనాలు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా కొన్ని భవనాల కోసం కొన్ని ప్రదేశాలు, కాలేజీలను పరిశీలించామన్నారు. కళాశాలను మరోచోటకి తరలించడం లేదని, విద్యార్థులు ఇబ్బందులను గుర్తించి తరగతుల నిర్వహణకు అవసరమైన తాత్కాలిక భవనాలను గుర్తించేందుకు యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు రాగానే తరగతులు ఎక్కడ నిర్వహిస్తామన్నది చెబుతామన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.వీరభద్రరావు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని శాంతియుత ర్యాలీ



భీమవరంలో శాంతియుత నిరసన ర్యాలీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : కూటమి ప్రభుత్వం రూపొందిస్తున్న నూతన మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదని, అయితే గత ఐదేళ్లగా మద్యం షాపుల్లో పనిచేస్తూ జీవిస్తున్నామని తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ బెవేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు పోతాయని తద్వారా 15 వేల మంది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం పాలసీ మారిస్తే తమకు కాంట్రాక్టు - ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియమాకాలు చేసి న్యాయం చేయాని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామన్నారు. ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాశ్‌రెడ్డి, యూనియన్ సభ్యులు జీవరత్నం పాల్గొన్నారు.

6న అతిథి అధ్యాపక ఉద్యోగానికి ఇంటర్వ్యూ

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 3 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్ర (సివిక్స్) గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపక పోస్టుకు ఈనెల 6వ తేదీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 11 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్వ్యూతో పాటుగా డెమో క్లాసు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

భీమవరం అర్బన్, సెప్టెంబరు 3 : ఆకాశన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి దేశవ్యాప్త పిలుపులో భాగంగా సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధరలు తగ్గించాలని సీపీఐ శ్రేణులు ధర్నా నిర్వహించారు. వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని పదేళ్ల క్రితం గద్దెనెక్కిన మోదీ కార్పొరేట్లకు అనుకూల విధానాలతో పదిరెట్లు ధరలు పెరిగాయని విమర్శించారు. అనంతరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ ఎస్ఎస్‌వీ ప్రసాద్‌కు అందజేశారు.

పొన్నపల్లిలో ఆక్రమణల తొలగింపు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 3: పట్టణంలో తరచూ ముంపునకు గురవుతున్న పొన్నపల్లి గ్రామంలో ఆక్రమణలు మంగళవారం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ పనులను చైర్‌పర్సన్ వెంకటరమణ పరిశీలించారు. మురుగు డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తే ముంపు సమస్య వీడుతుందన్నారు. అనంతరం వాటర్ వర్క్సును పరిశీలించారు. ఫిల్టర్ అయిన తరువాతే ప్రజలకు కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. పట్టణంలో ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దుర్గాభవాని, బుజ్జి, కావలి నాని, గోరు సత్తిబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు